సాక్షి సిద్దిపేట

మంగళవారం ∙ 4 ∙ జూలై ∙ 2023



ఇళ్లు కట్టిస్తామంటూ టోకరా

ఇళ్లు కట్టిస్తామంటూ లబ్ధిదారులను నమ్మించి చేతికి అందినంత సొమ్ము తీసుకొని ఓ బిల్డర్ కుటుంబంతో సహా ఉడాయించాడు. 8లో..



కార్పొరేట్‌కు దీటుగా బడులు

మన ఊరు- మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా నిర్మించి విద్య అందిస్తున్నట్లు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. 9లో..

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

సంక్షేమ పథకాల తీరుపై సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అధికారులు

సిద్దిపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల అమలు తీరుపై సోమవారం హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పాల్గొన్నారు. ఈసందర్భంగా పోడు పట్టాల పంపిణీ, గృహలక్ష్మి, హరితహారం, బీసీ వృత్తిదారుల రూ. లక్ష సాయం, ఎరువులు, విత్తనాలు, గొర్రెల పంపిణీ, ఆయిల్‌ఫాం, ధాన్యం మిల్లింగ్ వంటి వాటిపై సమీక్షించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందేలా చొరవ చూపాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, డీఎఫ్‌ఓ శ్రీనివాస్, డీఆర్డీఓ చంద్రమోహన్ రెడ్డి, డీపీఓ దేవకీదేవి, డీఏఓ శ్యాం ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు దొడ్డి కొమురయ్య వర్ధంతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని మంగళవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్టు జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి మురళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ పథకంలో భాగంగా వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కవిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో భాగంగా 1వ తరగతి (నాన్ రెసిడెన్షియల్)లో 87, 5వ తరగతి (రెసిడెన్షియల్)లో 89 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గడువు ఆగస్టు 10

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉమ్మడి మెదక్ జిల్లాలో 2023- 24 విద్యా సంవత్సరానికి గానూ ఓపెన్ పది, ఓపెన్ ఇంటర్‌లో అడ్మిషన్లు ఈనెల 10వ తేదీ నుంచి ఆగస్టు 10 వరకు స్వీకరించనున్నట్టు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు అభ్యర్థులు ఉమ్మడి మెదక్ జిల్లా ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ వెంకటస్వామి (8008409635) నెంబర్‌లో సంప్రదించాలన్నారు. అలాగే టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల మెమోలు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు అందించి మెమోలు తీసుకువెళ్లాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శ్రీధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోర్నాల, ఇర్కోడ్, చిన్నగుండవెల్లి, వెంకటాపూర్ గ్రామాల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపి వేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

13న సదరం క్యాంపు

సిద్దిపేటరూరల్: దివ్యాంగుల గుర్తింపు శిబిరమైన సదరం క్యాంపును ఈనెల 13, 20, 27, తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి చంద్రమోహన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా క్యాంపునకు హాజరయ్యే దివ్యాంగులు మీసేవ, ఈసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చే సుకుని ఫారం ఏ నమోదు చేసుకున్న రశీదును పొందాలన్నారు. రశీదుతో పాటు ఆధార్‌కార్డు, ఫొటో, డాక్టర్ పరిశీలించిన నివేదికలు, స్కానింగ్, ఎక్స్‌రే కాపీలు తీసుకుని సిద్దిపేట ప్రభుత్వ సాధారణ ఆస్పత్రికి మ ధ్యాహ్నం 12 గంటల లోపు హాజరు కావాలని సూచించారు.

ట్రిపుల్ ఐటీలో టాప్

- జిల్లా నుంచి 322 మంది విద్యార్థుల ఎంపిక
- రాష్ట్రంలోనే మొదటి స్థానం
- రాణిస్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు



బాసర ట్రిపుల్ ఐటీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలోనే సిద్దిపేట జిల్లా విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో అత్యధిక సీట్లు సాధించారు. గతేడాది 225 మంది ఎంపిక కాగా జిల్లా రెండవ స్థానంలో నిలిచింది. ఈ విద్యా సంవత్సరం 322 మంది విద్యార్థుల ఎంపికతో మొదటి స్థానంలో నిలిచింది. 2022–23 విద్యా సంవత్సరానికి గానూ జిల్లాలో 227 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 7,235 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 126 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. బాసర ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకోగా అత్యధికంగా 322 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా ట్రిపుల్ ఐటీలో అత్యధిక సీట్లు సాధించింది. జిల్లా విద్యారంగంలో రాణించేందుకు మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ ఉంది. పరీక్షల సమయం దగ్గరపడుతున్న కొద్ది విద్యాశాఖ అధికారులతో రోజు వారీగా సమావేశాలు నిర్వహించారు. నేరుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతోనూ ఫోన్‌లో మాట్లాడారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లా వరుసగా రెండు సంవత్సరాలు మొదటి, రెండవ స్థానంలో నిలిచింది. ట్రిపుల్ ఐటీలో సైతం అత్యధిక మంది విద్యార్థులు ఎంపిక కావడానికి మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక దృష్టి సాధించారని డీఈఓ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

జోరు తగ్గని ఇందిరానగర్ పాఠశాల

ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఈ విద్యా సంవత్సరం ట్రిపుల్ ఐటీకి అత్యధిక మంది విద్యార్థులు ఎంపికయ్యారు. గత విద్యా సంవత్సరం ఆరుగురు ఎంపిక కాగా ఈ విద్యాసంవత్సరం ఏకంగా 32 మంది ఎంపికయ్యారు. ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోజు ఐదు కిలోమీటర్ల కాలినడక..



మాది వ్యవసాయ కుటుంబం. నెంటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేశాను. ప్రతి రోజు ఇంటి వద్ద తల్లిదండ్రులకు తోడుగా వ్యవసాయ పనుల్లో సహాయం చేస్తూ 5 కిలోమీటర్లు కాలినడకన పాఠశాలకు వెళ్లి చదువుకున్నా. పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించా. బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించా. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందించిన సహాయం మరువలేనిది. ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగం మంచి ఉద్యోగం సాధిస్తా.

– ప్రభాకర్, గోవిందాపూర్ గ్రామం, వర్గల్ మండలం

అందరి ప్రోత్సాహంతోనే..



ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాలని కష్టపడి చదివా. 10వ తరగతి ఫలితాల్లోను 10 జీపీఏ సాధించా. ప్రతి రోజు మా పాఠశాలలో ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రత్యేక చొరవ తీసుకుని బోధన చేశారు. ఉపాధ్యాయులు నిత్యం మా వెంటే ఉండి ప్రోత్సహించారు. నేను భవిష్యత్‌లో సివిల్ ఇంజనీర్ కావాలనుకుంటున్నా.

– నితీష, ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సిద్దిపేట

సంతోషంగా ఉంది



విద్యారంగంలో సిద్దిపేట జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ అన్ని రకాల విద్యాసంస్థలు ఉన్నాయి. సిద్దిపేట నుంచి 322 మంది విద్యార్థులు, సంగారెడ్డి నుంచి 178 మంది, మెదక్ నుండి 78 మంది విద్యార్థులతో రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషితోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి.

– హరీశ్‌రావు, ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి

సత్వరమే పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- ప్రజావాణికి 50 అర్జీలు

సిద్దిపేటరూరల్: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిపై నమ్మకం పెరుగుతున్న క్రమంలో ఎక్కువగా అర్జీదారులు వస్తున్నారని తెలిపారు. భూ సంబంధిత, డబుల్‌బెడ్రూం, పెన్షన్లు తదితర సమస్యలపై 50 దరఖాస్తులు వచ్చాయి. దళితులకు మూడెకరాల భూమి పంపిణీలో భాగంగా తమకు ప్రభుత్వం రెండున్నర ఎకరాల చొప్పున భూమిని పంపిణీ చేసి పాస్‌బుక్ అందించిందని.. అప్పటి నుంచి నేటి వరకు భూమి సరిహద్దులను మాత్రం చూపించలేదని అక్కన్నపేట మండలం, రాయవరం గ్రామానికి చెందిన మహిళలు అధికారులకు విన్నవించారు. ఇప్పటికైనా భూమి సరిహద్దులు చూపిస్తే వ్యవసాయం చేసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం నిరుద్యోగ దివ్యాంగులకు బ్యాక్ లాగ్ పోస్టులను మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతూ తెలంగాణ వికలాంగుల వేదిక జిల్లా అధ్యక్షుడు అరగొండ మల్లేశం ఆ ధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్



మాట్లాడుతున్న పరమేశ్వర్

గజ్వేల్: ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీఎన్‌జీఓ సంఘం పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్ అన్నారు. సోమవారం గజ్వేల్‌లో నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా టీఎన్‌జీఓ సంఘం అండగా ఉంటూ పరిష్కారానికి కృషి చేస్తుందని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి మొదటి పీఆర్‌సీ 43 శాతం, రెండో పీఆర్‌సీ 30 శాతం ఫిట్‌మెంట్ సాధించిన ఘనత తమదేనన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధుల్లా పనిచేస్తూ అభివృద్ధి, సంక్షేమంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గజ్వేల్ శాఖ అధ్యక్షుడిగా లింగంను మూడోసారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా కార్యదర్శిగా రాజశేఖర్‌రెడ్డి, సహా అధ్యక్షులుగా శివప్రసాద్, కోశాధికారిగా ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా అశ్వక్ అహ్మద్ వ్యవహరించగా జిల్లా సంయుక్త కార్యదర్శి నాగభూషణం, నాయకులు జానకీరామ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు, స్థలాలు అందించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సిద్దిపేటరూరల్: అర్హులైన పేదలందరికీ ఇళ్లతో పాటు, ఇంటి స్థలాలు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి నిర్మాణానికి రాష్ట్రం రూ. 5 లక్షలు, కేంద్రం రూ. 10 లక్షలు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి ఏటా ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కోటి ఇళ్లు ఇస్తామని చెప్పి తొమ్మిదేళ్లు గడిచినా అందించిన దాఖలాలు లేవని మండిపడ్డారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. లేనిపక్షంలో పేదలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సింగిరెడ్డి నవీన, నాయకులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, రవికుమార్, కొంగర వెంకట్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఐలుగా పదోన్నతి



పదోన్నతి పొందిన అధికారులతో సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వర్తిస్తున్న 2014 బ్యాచ్‌కు చెందిన తిరుపతి, కార్తీక్ ఆర్‌ఐలుగా పదోన్నతి పొందడంతో సీపీ శ్వేత వారికి సోమవారం మూడు నక్షత్రాల చిహ్నాలను అలంకరించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పదోన్నతులు ఉత్సాహంతో పాటు నూతన బాధ్యతలను పెంచుతాయన్నారు. పదోన్నతి పొందిన వారిని అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రాంచదర్‌రావు, సుభాష్ చంద్రబోస్ అభినందించారు.

తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా మల్లారెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా సిద్దిపేటకు చెందిన ప్రముఖ కవి, రచయిత కొండి మల్లారెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి కరీంనగర్ ఫిల్మ్ భవన్‌లో జరిగిన రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడిగా మల్లారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాకు చెందిన కవులు, రచయితలు పర్కపెల్లి యాదగిరి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, ఉప్పల పద్మ, సడాకుల కిషన్ రాష్ట్ర కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. జిల్లాకు చెందిన కవులు, రచయితలు రాష్ట్రస్థాయిలో బాధ్యతలు స్వీకరించడంతో పలువురు అభినందనలు తెలియజేశారు.



అమ్మవారి లక్ష పుష్పార్చనలో మహిళలు

వైభవంగా మూల మహోత్సవం



శాకంబరీదేవిగా వర్గల్ సరస్వతీ అమ్మవారు

వర్గల్(గజ్వేల్): కూరగాయలే ఆభరణాలయ్యాయి. కరువు తీర్చే కల్పవల్లి శ్రీ శాకంబరీదేవిగా వర్గల్ సరస్వతీ అమ్మవారు కొలువుదీరారు. ఆషాఢమాసం గురుపౌర్ణమి వేళ సోమవారం మూల మహోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని భక్తులు తరించారు. ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి పర్యవేక్షణలో తెల్లవారుజామున మూల మహోత్సవ వేడుకలకు అంకురార్పణ చేశారు. గర్భగుడిలో అమ్మవారి మూలవిగ్రహానికి విశేష అభిషేకం జరిపారు. అనంతరం టన్నుల కొద్ది కూరగాయలను ఆభరణాలుగా అమ్మవారిని కమనీయంగా అలంకరించారు. వేద పాఠశాల విద్యార్థులు, మహిళా సేవికలు అమ్మవారికి లక్ష పుష్పార్చన చేశారు. యాగమండపంలో చండీ హోమం నిర్వహించారు.



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

అభివృద్ధిని జీర్ణించుకోలేకే కుట్రలు

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడం జీర్ణించుకోలేని కాంగ్రెస్, బీజేపీలు బీఆర్‌ఎస్‌పై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నాయని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమంతో ప్రజల్లో ఉనికి కోల్పోయిన ప్రతిపక్షాలు నేడు వివిధ రకాల కుట్ర లతో ప్రజల ముందుకు వస్తున్నాయని ఆరోపించారు. ఖమ్మంలో నిర్వహించిన సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ తెలంగాణపై తమకున్న విజన్‌ను చూపకపోగా రేవంత్‌రెడ్డి ఇచ్చిన పత్రాన్ని మాత్రమే చదివి వినిపించారని ఎద్దేవా చేశారు. ఆ పార్టీలో ఇప్పటికిప్పుడు సీఎం అభ్యర్థి ఎవరనే విషయం రాహుల్ ప్రకటించగలరా? అని ప్రశ్నించారు. బీజేపీలోనూ ఇదే రకమైన పరిస్థితి ఉందని చెప్పారు. సమావేశంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, జెడ్పీటీసీ మల్లేశం, రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవీ రవీందర్, గజ్వేల్, మర్కూక్, కొండపాక మండలాల పార్టీ అధ్యక్షులు బెండ మధు, కర్ణాకర్‌రెడ్డి, నూనె కుమార్, గజ్వేల్ పట్టణ శాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా, తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని మండలాలకు చెందిన యువతీ, యువకులు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

‘బస్సుయాత్రను విజయవంతం చేయండి’



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎండగడుతూ నిరుద్యోగ భృతిని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుంచి చేపట్టనున్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని తీగుల్‌లో కాంగ్రెస్ నేతలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 9 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో యువతకు ఒరగబెట్టిందేమీలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఉద్యోగాలు కల్పించడంతో పాటు చేయూత కింద రూ. 4 వేల పెన్షన్ అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కరుణాకర్, సత్తిరెడ్డి, ముత్యాలు, మనోజ్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదోన్నతులు లేకుండానే ఉద్యోగ విరమణ చేసే పరిస్థితులు రాష్ట్రంలో ఏర్పడ్డాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులు, విద్యారంగం అభివృద్ధి పట్ల అలసత్వం ప్రదర్శిస్తుందన్నారు. ధనిక రాష్ట్రమైన విద్యారంగానికి బడ్జెట్‌లో ఏడు శాతం కేటాయింపులతో చివరి స్థానంలో నిలిచిందన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రారంభించిన అంబలి పంపిణీ కార్యక్రమం ఎక్కడ అమలు కావడం లేదని మండిపడ్డారు. 317 జీఓలో స్థానికేతరులుగా మారిన ఉపాధ్యాయుల సమస్యలను, పరిష్కార మార్గాలను చర్చించడానికి ముఖ్యమంత్రికి సమయం దొరకడం లేదన్నారు. వర్షాకాల సమావేశాల్లో రెండవ పీఆర్సీ ఏర్పాటు చేయడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించి పీఆర్సీ కమిటీ వేసి మధ్యంతర భృతి ప్రకటించే విధంగా కృషి చేస్తానన్నారు. అనంతరం తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంత రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికలకు ఇచ్చినంత ప్రాధాన్యం విద్యారంగ అభివృద్ధికి ఇవ్వడం లేదన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని గత ఎన్నికల సమయంలో చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పటికీ చేయలేదని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, సామాజిక ఉద్యమకారుడు భాస్కర యోగి, జిల్లా అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, తిరుపతి, శ్రీనాకర్‌రెడ్డి, జనార్దన్, నర్సిరెడ్డి, మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో 19 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 19 మందిని ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. వీరిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 19 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృత్యువాత

చేర్యాల(సిద్దిపేట): విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతిచెందిన సంఘటన మండలపరిధిలోని ఆకునూరులో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జక్కు మల్లేశం ఆదివారం రాత్రి పొలం పనులు ముగించుకుని పాడి గేదెను బావి వద్ద కట్టేసొచ్చాడు. సోమవారం ఉదయం వెళ్లిచూడగా విద్యుత్‌వైర్లు కింద పడి ఉన్నాయి, షాక్ తగిలి పాడిగేదె మృతి చెంది ఉందన్నాడు. ఈ ఘటనలో సుమారు రూ.80వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

మేకపోతు కూడా..

శివ్వంపేట(నర్సాపూర్): కరెంట్ షాక్‌తో మేకపోతు మృతిచెందిన సంఘటన రూప్లతండా పంచాయతీ పరిధిలోని పోతిరెడ్డిపల్లి తండాలో సోమవారం చోటుచేసుకుంది. వ్యవసాయ పొలాల వద్ద ప్రమాదభరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్‌లు కింద పడి ఉండటంతో షాక్ తగిలి బనావత్ భిక్షపతికి చెందిన మేకపోతు మృతిచెందింది. దీని విలువ సుమారు రూ.22వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఇక్కడ తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు వాపోయారు. గతంలోనూ పలు గేదెలు మృతిచెందాయన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి వేరేచోటికి మార్చాలని అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదన్నారు.

దొంగ అరెస్ట్

తూప్రాన్: మండలంలోని ఆయా గ్రామాల్లో వ్యవసాయ బోరు బావుల వద్ద కేబుల్ వైర్లు, స్టార్టర్లు చోరీ చేస్తున్న దొంగను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని వట్టూరు, పడాల్‌పల్లి, నాగులపల్లి, జేండాపల్లి గ్రామాల్లో వ్యవసాయ బోరుబావుల వద్ద రాత్రి వేళల్లో కేబుల్ వైర్లు, స్టార్టర్లు దొంగతనం చేస్తున్న శివ్వంపేట మండలం పెద్ద గొట్టిముక్ల గ్రామానికి చెందిన బాణాపురం ఆంజనేయులు(38) అనే వ్యక్తి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. దీంతో అతడిని పోలీసులు అరెస్టు చేశారు. దొంగలించబడిన కేబుల్ వైర్లు, స్టార్టర్లు కొన్నింటిని రికవరీ చేశారు. నిందితుడిపై కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.

భవనం పై నుంచి పడి విద్యార్థికి తీవ్రగాయాలు

పటాన్‌చెరు టౌన్: రెండో అంతస్తు పైనుంచి కింద పడి ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు మండలం పాటీ నారాయణ కళాశాల క్యాంపస్‌లో చోటుచేసుకున్నట్లు సమాచారం. ఆంధ్ర రాష్ట్రం ఒంగోలుకు చెందిన ఓ విద్యార్థిని తల్లిదండ్రులు ఇటీవల ఇంటర్ మొదటి సంవత్సరంలో చేర్పించారు. అయితే సోమవారం విద్యార్థి భవనం రెండో అంతస్తు పై నుంచి పడటంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం రామచంద్రాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి ప్రమాదవశాత్తు పడ్డాడా? మరేదైన కారణం ఉందా తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై భానూర్-బీడీఎల్ పోలీసులను సంప్రదించగా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

ఇళ్లు కట్టిస్తానంటూ బిల్డర్ టోకరా


బాధితులు

- కుటుంబంతో సహా పరారీ
- తమకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు

దుబ్బాకటౌన్: ఇళ్లు కట్టిస్తామంటూ లబ్ధిదారులను నమ్మించి చేతికి అందినంత సొమ్ము తీసుకొని కుటుంబంతో సహా ఉడాయించాడు ఓ బిల్డర్. సోమవారం బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో ఈ ఉదంతం పట్టణంలో వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్ర రాష్ట్రం ఒంగోలు జిల్లా పామూరు మండలం బోట్ల గూడూరు గ్రామానికి చెందిన బిల్డర్ పిక్కిలి ప్రసాద్ పదేళ్లుగా దుబ్బాకలో నివసిస్తున్నాడు. ప్రైవేటు బిల్డింగ్‌లు కట్టిస్తుంటాడు. నూతనంగా ఇళ్లు కట్టుకునే వారితో గంపగుత్త(కాంట్రాక్టు)గా మాట్లాడుకుని గృహాలు నిర్మిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం పట్టణానికి చెందిన సుమారు 25 మంది లబ్ధిదారులకు ఇళ్లు కట్టిస్తానని నమ్మించి రూ. 2 కోట్లకుపైగా నగదు వసూలు చేశాడు. తీరా బిల్డర్ ప్రసాద్ ఆదివారం రాత్రికిరాత్రే కుటుంబంతో సహా పరారయ్యాడు. సోమవారం ఉదయం బిల్డర్ ఉంటున్న అద్దె ఇంటికి బాధితులు వెళ్లారు. అక్కడ ఇంట్లో సామగ్రి సహా అందరూ పరారయ్యారు. అతడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వస్తుంది. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ మహేందర్ వివరణ కోరగా పట్టణానికి చెందిన పుట్ట నాగరాజ్‌తో పాటు మరికొందరు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రూ. 17 లక్షలిస్తే శ్లాబ్ వేసి వదిలేశాడు



నా పేరు కంపె మౌనిక. నాది దుబ్బాక మండలం రఘోత్తంపల్లి. నేను బిల్డర్ ప్రసాద్‌కు గృహ నిర్మాణం కోసం రూ.17 లక్షలు ఇచ్చాను. బిల్డింగ్ శ్లాబ్ మాత్రమే పూర్తయింది. ఇంకా రూ.13 లక్షల పని మిగిలి ఉంది.

– కంపె మౌనిక, రఘోత్తంపల్లి

బిల్డర్‌ను పట్టుకుని న్యాయం చేయండి



నా పేరు రాయిని తిరుమలేశ్. నేను దుబ్బాకలో బిల్డింగ్ కట్టమని బిల్డర్ ప్రసాద్‌తో కాంట్రాక్టు మాట్లాడుకున్నాను. అతడు నన్ను రూ.6 లక్షల పైనే మోసం చేశాడు. పోలీసులు అతడిని పట్టుకుని న్యాయం చేయాలి.

–రాయిని తిరుమలేశ్, దుబ్బాక

గజ్వేల్‌లో ఉద్రిక్తత


గజ్వేల్‌లో పరిస్థితిని సమీక్షిస్తున్న సిద్దిపేట సీపీ శ్వేత

- ఓ విగ్రహం వద్ద మూత్ర విసర్జనతో మొదలైన గొడవ
- రెండు వర్గాల మధ్య రాజేసిన వివాదం
- రాస్తారోకోతో స్తంభించిన ట్రాఫిక్
- హుటాహుటిన పట్టణానికి చేరుకున్న సిద్దిపేట సీపీ శ్వేత
- నేడు బంద్‌కు పిలుపు

గజ్వేల్/గజ్వేల్‌రూరల్: పట్టణంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఓ విగ్రహం వద్ద మూత్ర విసర్జన చేయడం.. రెండువర్గాల మధ్య వివాదానికి కారణమైంది. ఈ విషయం తెలుసుకున్న సిద్దిపేట సీపీ శ్వేత హుటాహుటిన ఇక్కడికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న ఓ విగ్రహం వద్ద సోమవారం ఓ వ్యక్తి మూత్ర విసర్జన చేశాడు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన కొందరు ఏకమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందజేశారు. దీంతో పోలీసులు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన రెండు వర్గాల మధ్య వివాదం రాజేసింది. అంబేద్కర్ చౌరస్తా వద్ద విగ్రహ ఘటనపై పలువురు నిరసన వ్యక్తం చేస్తుండగా, నిందితుడి తరఫున కొందరు వచ్చి ఓ యువకుడి తలపై కొట్టి పారిపోయాడు. దీంతో ఉద్రిక్తత తీవ్రతరమైంది. యువకుడిపై దాడి ఘటన సమాచారం తెలుసుకున్న పలువురు పెద్ద సంఖ్యలో అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకొని బైఠాయించారు. గంటల తరబడి రాస్తారోకో చేపట్టారు. స్థానిక ఏసీపీ రమేష్ అప్రమత్తమై అక్కడికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించే ప్రయత్నం చేశారు. అప్పటికప్పుడు ప్రత్యేక బలగాలను రప్పించారు. రాస్తారోకో వల్ల ఉద్రిక్తత కొనసాగుతుండగా ఈ విషయం తెలుసుకున్న సిద్దిపేట సీపీ శ్వేత హుటాహుటిన గజ్వేల్‌కు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కాగా యువకుడి దాడి ఘటనను నిరసిస్తూ మంగళవారం గజ్వేల్‌లో బంద్‌కు పిలుపునిచ్చారు.

అల్లాదుర్గం-వట్‌పల్లి రోడ్డుకు మరమ్మతులు


రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

వట్‌పల్లి(అందోల్): అల్లాదుర్గం నుంచి వట్‌పల్లి మీదుగా మెటల్‌కుంటా వెళ్లే రోడ్డు రెండేళ్లుగా మరమ్మతులకు నోచడం లేదని, ఈ గుంతల్లో ప్రయాణం వాహనదారులకు ప్రాణసంకటంగా మారిందని సోమవారం సాక్షి దినపత్రికలో 'పట్టించుకునేవారే లేరా' పేరిట కథనం ప్రచురించింది. అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ చొరవతో స్పందించిన బీఆర్‌ఎస్ నాయకులు రోడ్డుపై ఏర్పడిన గుంతలలో కంకర వేసి పూడ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్నట్లు పీఏసీఎస్ డైరెక్టర్ బుద్ధిరెడ్డి తెలిపారు. ప్రస్తుతం మరమ్మతుల విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ మనోజ్ వివరణ కోరగా, వాటికి సంబంధించి ప్రత్యేకంగా ఎటువంటి నిధులూ మంజూరు కాలేదన్నారు. సోమవారం గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజుల్లో ఈ రోడ్డుపై మూడు వాహనాలు ఇరుక్కపోవడం, ఓ వాహనం బోల్తా పడటం వంటి వరుస ఘటనలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే.

ఇద్దరు అదృశ్యం


రాథోడ్

ఝరాసంగం(జహీరాబాద్): వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమయ్యారు. ఈ ఘటనలు మండలంలో చోటుచేసుకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని చీలపల్లి తాండ గ్రామానికి చెందిన రాథోడ్ సంతోష్ (30) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. గత నెల 29న రాత్రి 8 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి కారు తీసుకుని వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. సంతోష్ ఆచూకీ కోసం తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోయింది. సోమవారం అతడి భార్య బానోత్ మమత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

జహీరాబాద్‌లో..


అహ్మద్

పట్టణానికి చెందిన అహ్మద్(36) మార్బుల్ గ్రానైట్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈనెల 1న ఝరాసంగం మండల పరిధిలోని జునేగావ్ గ్రామానికి పని కోసం వెళ్లాడు. పనులు ముగించుకొని రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వస్తున్నానని కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మరికొంత కాసేపటికే రావటం లేదని మరుసటిరోజు ఉదయం వస్తానని చెప్పాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో సోమవారం కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ రాజేందర్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడికి రిమాండ్

గజ్వేల్‌రూరల్: జేఎల్‌ఎం(జూనియర్ లైన్‌మెన్)నరేశ్ పై పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన కరుణాకర్ రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ ఎస్‌ఐ నరేష్ సోమవారం పేర్కొన్నారు. క్యాసారంలోని 2వ వార్డు వాసి కరుణాకర్ ఇంటికి వచ్చిన కరెంటు బిల్లు చెల్లించకపోవడంతో జేఎల్‌ఎం రెండ్రోజుల క్రితం విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. దీంతో అసహనానికి గురైన వినియోగదారుడు కరుణాకర్ అదే రోజు బైక్‌లోని పెట్రోల్ తీసి జేఎల్‌ఎం నరేశ్‌పై పోయడంతో కరుణాకర్ కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. తనపై హత్యాయత్నం జరిగిందని నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొండపాకకు వెళుతుండగా..

- తండ్రి పరిస్థితి విషమం
- కుమారుడికి స్వల్పగాయాలు


గాయపడిన శ్రీనివాస్


హర్షవర్ధన్

కొండపాక(గజ్వేల్): బైక్‌ను ఆటో ఢీకొనగా తండ్రీకొడుకులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని రవీంద్రనగర్ గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం.. చేర్యాల మండలం అర్జునపట్ల గ్రామానికి చెందిన తాళ్లపల్లి హర్షవర్ధన్ కొండపాకలోని బీసీ బాలుర వసతి గృహంలో ఉండి చదువుకుంటున్నాడు. ఆదివారం హర్షవర్ధన్ ఇంటికి వెళ్లాడు. సోమవారం హర్షవర్ధన్ అతడి తండి శ్రీనివాస్ బైక్‌పై తిరుగు పయనమవుతుండగా రవీంద్రనగర్ శివారులో ఆటో, బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తలకు బలమైన గాయమైంది, హర్షవర్ధన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సిబ్బంది మహేందర్, రమేష్ సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారని 108 సిబ్బంది పేర్కొన్నారు.

కారు బోల్తా.. మహిళ దుర్మరణం
బాధితులంతా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లావాసులు

మునిపల్లి(అందోల్): కారు బోల్తా పడిన ఘటనలో మహిళ మృతిచెందింది. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన లింగంపల్లి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. బుదేర ఎస్‌ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. ఆంధ్ర రాష్ట్రం గుంటూరు జిల్లాకు చెందిన సాయివరుణ్ తన తల్లి కల్పన(46) మామ గణేష్, అత్త సుజాతలతో కలిసి ఈ నెల 1న జహీరాబాద్ మీదుగా కర్ణాటక రాష్ట్రంలో ఉన్న ఘాణగాపూర్ పుణ్యక్షేత్రానికి దైవ దర్శనం కోసం కారులో వెళ్లారు. ఆరోజు రాత్రికి అక్కడే ఉండి మరుసటి రోజు ఉదయం తిరుగు పయనమయ్యారు. ఆ సమయంలో సాయివరుణ్ మేనమామ గణేష్ కారు నడుపుతున్నాడు. జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపునకు వస్తున్న క్రమంలో మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామ శివారులో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కల్పన, సుజాతలకు తీవ్రగాయాలు కాగా, సాయివరుణ్, గణేష్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. అందరినీ జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కల్పనను సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. సుజాత, సాయివరుణ్, గణేశ్ హైదరాబాద్‌లోని మరో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సాయివరుణ్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిపై దాడి

నర్సాపూర్: ఓ విద్యార్థిని తోటి విద్యార్థులు కొట్టారు. ఈ ఉదంతం సోమవారం మండలంలోని తునికి ఎంజేపీ గురుకుల పాఠశాలలో వెలుగుచూసింది. ప్రిన్సిపాల్ కథనం ప్రకారం.. తునికి ఎంజేపీ గురుకుల పాఠశాలలో కౌడిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం విద్యార్థులు గొడవ పడ్డారు. దీంతో రాత్రి అసభ్య పదజాలంతో తిట్టాడని, అదే తరగతికి చెందిన పలువురు విద్యార్థులు దాడి చేసి కొట్టారు. ఆ సమయంలో బాధితుడు ఉపాధ్యాయులకు గానీ, స్నేహితులకు గానీ చెప్పలేదు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి చెప్పడంతో అక్కడికి తల్లిదండ్రులు చేరుకొని ఉపాధ్యాయులను నిలదీశారు. దీంతో ప్రిన్సిపాల్ శివప్రసాద్ దాడికి పాల్పడిన విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. కాగా తమను ఇష్టానుసారంగా అసభ్యపదజాలంతో దూషించడంతో కొట్టినట్లు విద్యార్థులు చెప్పారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని, ఏదైనా సమస్య ఉంటే ఉపాధ్యాయులకు చెప్పాలని ప్రిన్సిపాల్ సూచించారు.

తాగి వాహనాలు నడపొద్దు

టూటౌన్ సీఐ రవికుమార్

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి నడపాలని టూటౌన్ సీఐ ఆటో డ్రైవర్లకు సూచించారు. ట్రాఫిక్ అవేర్‌నెస్‌లో భాగంగా టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఆటోలు నిలుపరాదని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


ఆటోడ్రైవర్లకు అవగహన కల్పిస్తున్న సీఐలు రవికుమార్, రామకృష్ణ

సైబర్ కేటుగాళ్ల టోకరా

కమిషనరేట్ పరిధిలో కేసులు నమోదు

సిద్దిపేటకమాన్: పార్ట్‌టైం జాబ్, ఆన్‌లైన్ జాబ్, ఆన్‌లైన్ లోన్ యాప్‌ల పేరుతో సైబర్ నేరగాళ్లు, పలువురు బాధితుల నుంచి రూ. 49,544 కాజేశారు. ఈ సంఘటనలు సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో సోమవారం చోటుచేసుకున్నాయి. పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత కథనం ప్రకారం.. సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో పార్ట్ టైం జాబ్ గురించి వచ్చిన లింకును ఓపెన్ చేశారు. టాస్క్‌లో భాగంగా తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించాడు. దీంతో బాధితుడు రూ.29వేలు పెట్టుబడిగా పెట్టాడు. అలాగే.. మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ మహిళ ఓ సోషల్ మీడియాలో పెన్సిల్ ప్యాకింగ్ జాబ్ గురించి ప్రకటన చూసి ఆన్‌లైన్‌లో పని చేయడానికి వివరాలు నమోదు చేసుకుంది. అనంతరం గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మెటీరియల్ ఖర్చు, సెక్యూరిటీ డిపాజిట్‌గా కొంత మొత్తం డబ్బులు పంపించాలని సూచించాడు. బాధితురాలు రూ.6,800 పంపించింది. కాగా, సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఆన్‌లైన్ హ్యాకింగ్ ద్వారా తన ఫోన్‌లోని సమాచారం దొంగిలించి, తిరిగి పంపాలంటే డబ్బులు పంపించాలని బెదిరించాడు. దీంతో భయపడిన బాధితుడు రూ.7,644 పంపించాడు. మరో ఘటనలో.. రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఆన్‌లైన్ టీకా లోన్ యాప్‌లో కొంత మొత్తం లోన్ తీసుకున్నాడు. తాను తీసుకున్న డబ్బులు మొత్తం తిరిగి చెల్లించినా కూడా సైబర్ నేరగాడు ఫోన్ చేసి ఇంకా డబ్బులు చెల్లించాలని బెదిరించాడు.

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

వేర్వేరు చోట్ల పలు కారణాలతో నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటనలు రాయపోలు, చేగుంట, కొండపాక, తూప్రాన్‌లలో చోటు చేసుకున్నాయి. కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం...

పెళ్లిపై బెంగతో యువకుడు


సంజీవ్(ఫైల్)

రాయపోలు(దుబ్బాక): పెళ్లిపై బెంగతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్‌లో చోటుచేసుకుంది. దౌల్తాబాద్ ఎస్‌ఐ చైతన్యకుమార్ కథనం ప్రకారం.. తిర్మలాపూర్ గ్రామానికి చెందిన జంగమొల్ల సంజీవ్ (28) వ్యాపారం చేసుకునేవాడు. కొంతకాలంగా అతడికి పెళ్లి సంబంధాలు చూస్తుండగా ఏదీ కుదరడం లేదు. దీంతో కొన్ని రోజులుగా మనస్తాపంతో ఉంటున్న అతడు ఆదివారం పురుగుల మందు తాగాడు. తీవ్రమైన కడుపునొప్పిని భరించలేక కరెంటు తీగతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలయ్యాయి. మృతుడి తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు మందలించారని రైలు కింద పడి..


బాబు(ఫైల్)

చేగుంట(తూప్రాన్): రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మాసాయిపేటలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోతినిపల్లి బాబు(24) ఖాళీగా ఉండేవాడు. ఏదైనా పని చేసుకొని డబ్బులు సంపాదించుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన అతడు హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపునకు వెళ్తున్న ఓ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే ఎస్‌ఐ తావూ నాయక్ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహం పోస్టు మార్టం నిమిత్తం కామారెడ్డి రైల్వే ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో యువరైతు..


మహేందర్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): అప్పుల బాధతో పురుగుల మందు తాగి యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని అంకిరెడ్డిపల్లిలో ఆలస్యంగా సోమ వారం వెలుగు చూసింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకిరెడ్డిపల్లికి చెందిన రైతు కరడపల్లి మహేందర్(32)కు ఎకరా పొలం ఉంది. బోరుబావి ఆధారంగా వ్యవసాయం చేస్తుండేవాడు. వ్యవసాయం కోసం, నూతనంగా ఇంటి నిర్మాణం కోసం సుమారు రూ.10 లక్షలు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే విషయంలో పలుమార్లు కుటుంబీకులతో చెప్పుకొని మదనపడుతుండేవాడు. తరుచుగా కడుపు నొప్పి వస్తుండటంతో ఎన్ని మందులు వాడినా తగ్గడం లేదు. అప్పులు తీర్చే మార్గం కానరాక మనస్తాపం చెందిన అతడు జూన్ 29న వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి అపస్మరక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి భార్య ప్రత్యూష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ. భానుప్రకాశ్ తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో..

తూప్రాన్: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని ఇస్లాంపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేశ్‌కుమార్ కథనం ప్రకారం.. శివ్వంపేట మండలం గుండ్లపల్లికి చెందిన విభూతి సురేశ్(25)కు ఇస్లాంపూర్‌కు చెందిన ఎల్లమ్మతో వివాహమైంది. అప్పటి నుంచి ఇస్లాంపూర్‌లోనే నివాసం ఉంటున్నాడు. కూలీ పని చేసుకుంటూ భార్యాభర్తలు జీవిస్తున్నారు. మద్యానికి బానిసైన సురేశ్ నిత్యం ఇంట్లో గొడవ పడేవాడు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకెళ్లిన సురేశ్ తిరిగి ఎంతకీ ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం గ్రామ సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు మృతదేహం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న చంద్రయ్య

తూప్రాన్: కుటుంబ కలహాలతో వృద్ధుడు గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన పట్టణకేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చేగుంట మండలం చందాయిపేటకు చెందిన చంద్రయ్య(68) కుటుంబసభ్యులతో కలిసి కొన్నేళ్లుగా తూప్రాన్‌లో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. మనస్తాపం చెందిన చంద్రయ్య గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు.

నా ఎదుగుదలకు సిద్దిపేట తోడ్పాటు

సినీహీరో సంపూర్ణేష్ బాబు


లోగోను ఆవిష్కరిస్తున్న సంపూర్ణేష్ బాబు

సిద్దిపేటజోన్: నేను నటుడిగా ఎదగడానికి సిద్దిపేట తోడ్పాటు ఎంతో ఉందని, ఇక్కడి ప్రాంత ప్రజలు సంపూర్ణ సహకారం అందించారని బర్నింగ్ స్టార్, సినీ హీరో సంపూర్ణేష్ బాబు అన్నారు. సోమవారం స్థానిక విపంచి ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ, అసోసియేషన్‌కు తన పూర్తి మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్స్ మాట్లాడుతూ సిద్దిపేట కవులు, కళాకారులకు కోటలాంటిదని అన్నారు. అంతకుముందు బలగం చిత్రం ఫేమ్ ఐలయ్య పాత్రధారి కోట జయరాం, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సంపత్ రెడ్డిలతో కలిసి సంపూర్ణేష్ బాబు జ్యోతి ప్రజ్వలన, ఆపై అసోసి యేషన్ లోగో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, సతీష్, నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాం, కౌన్సిలర్లు విఠోభ, మోహిజ్, శ్రీహరి పాల్గొన్నారు.